

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
3★
శుక్రవారం 15 మార్చి 2024


ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కాంట్రాక్టు కార్మికులకు పెనాల్టీ రద్దు చేయాలి

6లో..



కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో?



- పెద్దపల్లి ఎంపీ టికెట్ కోసం 29 మంది దరఖాస్తు
- అభ్యర్థి ఎంపికపై అధిష్ఠానం మల్లగుల్లాలు
- అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్, బీజేపీలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయనున్న తమ అభ్యర్థులను బీఆర్ఎస్, బీజేపీలు ప్రకటించాయి. అయితే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఇంతవరకు తేల్చకపోవడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొన్నది. రాష్ట్రంలో పెద్దపల్లితో పాటు నాగర్‌కర్నూల్, వరంగల్ నియోజక వర్గాలను షెడ్యూల్ కులాలకు చెందిన వారికి రిజర్వు చేయడంతో కుల సమీకరణాల దృష్ట్యా ఏయే సామాజిక వర్గానికి ఈ మూడు నియోజక వర్గాల్లో అభ్యర్థులను ఎంపిక చేయాలనే విషయమై పార్టీ అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతున్నది. టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారితో పాటు పలువురి నాయకుల పేరిట పార్టీ పరంగా క్షేత్రస్థాయిలో సర్వే కూడా చేయించినట్లు సమాచారం.

ఇప్పటికే ఇక్కడినుంచి పార్టీ టికెట్ ఆశించిన టీపీసీసీ కార్యదర్శి, నేతకాని సామాజిక వర్గానికి చెందిన గొమాసే శ్రీనివాస్ నేత తనకు టికెట్ రాదని గమనించి బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన మూడు రోజులకే బీజేపీ టికెట్ సాధించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ మాల సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను అభ్య ర్థిగా ప్రకటించింది. ఇప్పటికే ఆయన ఆయా నియో జకవర్గాలు పర్యటిస్తూ పార్టీ నాయకులు, ప్రజాప్రతి నిధులను కలుస్తూ వస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇప్పటివరకు అభ్యర్థిని ప్రక టించలేదు. పెద్దపల్లి టికెట్‌ను మాదిగ సామాజిక వర్గాని కి చెందిన వారికే ఇవ్వాలంటూ ఆ వర్గాల నుంచి డిమాం డ్లు వస్తున్నాయి. పలు వేదికల మీద నుంచి వాళ్ల గళం విప్పు తున్నారు. ఈనెల మొదటి వారంలో జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తు న డప్పుల ర్యాలీ నిర్వహించారు. తాజాగా పెద్దపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు.

ఆశావహుల్లో ఉత్కంఠ..

మూడు మాసాల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసిన విషయం తెలిసిందే. దీంతో పార్టీ టికెట్ ఎవరికి వచ్చినా గెలుపు నల్లేరు మీద నడకేనని భావిస్తున్న ఆశావహులు టికెట్ కోసం పోటీ పడుతున్నారు. మాల సామాజిక వర్గానికి చెందిన గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ, నేతకాని సామాజిక వర్గానికి చెందిన సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేష్ నేత, మాదిగ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ డాక్టర్ పి సుగుణకుమారి, పార్టీ నాయకులు ఊట్ల వరప్రసాద్, ఆసంపల్లి శ్రీనివాస్, గజ్జెల కాంతం, పెర్క శ్యామ్ తదితరులు టికెట్ కోసం పోటీ పడుతున్నారు. వరంగల్, నాగర్ కర్నూల్ నియోజకవర్గాల్లో ఏ సామాజిక వర్గానికి చెందిన వారికి టికెట్ ఇస్తారో, దానిని బట్టి ఇక్కడ అభ్యర్థిని ఎంపిక చేసే అవకాశాలున్నాయి. బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత ఆ పార్టీని వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. ఆయన కూడా పార్టీ టికెట్ కోసం సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తున్నారు.

గడ్డం వివేక్ తన కుమారుడికి టికెట్ ఇప్పించుకునేందుకు పార్టీ అధిష్ఠానంపై తీవ్ర ఒత్తిడి తీసుకవస్తున్నట్లు సమాచారం. వంశీకృష్ణకే టిక్కెట్ ఇచ్చే విషయమై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొగ్గు చూపుతున్నారని ప్రచారం జరుగుతున్నది. పార్లమెంట్ ఇన్‌చార్జీ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాత్రం మాజీ ఎంపీ సుగుణకుమారి అభ్యర్థిత్వంపై మొగ్గు చూపుతు న్నారని తెలుస్తున్నది. ఊట్ల వరప్రసాద్, ఆసంపెల్లి శ్రీనివాస్‌లు కూడా శ్రీధర్‌బాబు ఆశీస్సుల కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎంపీ వెంకటేశ్ నేతకు టికెట్ ఇప్పించేందుకు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు పట్టుబడుతున్నట్లు సమాచారం. పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని అభ్యర్థిని ఎంపిక చేసే నిర్ణయాన్ని అధిష్ఠానానికే వదిలేసినట్లు తెలుస్తున్నది. అభ్యర్థి ఎవరనేది ఇప్పటి వరకు తేల్చకుండా పార్టీ అధిష్ఠానం జాప్యం చేస్తుండడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొన్నది.

ఓటరు నమోదు, మార్పులపై సమీక్ష



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

జ్యోతినగర్, మార్చి 14 : ఓటరు నమోదు, మార్పు తదితర అంశాలపై రామగుండం నియోజకవర్గం బీఎల్ఓ, సూపర్‌వైజర్లతో గురువారం ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియం హాలులో సమీక్షా సమావేశం జరిగింది. అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) జె.అరుణశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఓటరు నమోదు ప్రక్రియ, మార్పులు, చేర్పులు, ఫార్మ్ పెండెన్సీ, షిఫ్టింగ్, బీఎల్ఓల ఇంటింటి సర్వే నూతన కార్డుల పంపిణీ, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ అ రుణశ్రీ సిబ్బందితో చర్చించారు. నిర్ణీత వ్యవధిలో అన్ని పనులు పూర్తిచేయాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, డిప్యూటీ తహసిల్దార్ విజయ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్మీడియట్ పరీక్షలు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 14 : జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని నోడల్ అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 14వరకు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. ఇంటర్ పరీక్షలు సజావుగా జరిగేందుకు తోడ్పడిన అధికారులందరిని అభినందించారు. మొత్తం 24 పరీక్షాకేంద్రాల్లో పరీక్షలు నిర్వహించామని తెలిపారు.

పాఠశాలల్లో డీఈవో ఆకస్మిక తనిఖీ

ఓదెల, మార్చి 14: మండలంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా విద్యాధికారి డి.మాధవి గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఉపాధ్యాయుల సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలపై తనిఖీలు నిర్వహించారు. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు తమ విధుల నిర్వహణపై నిర్లక్ష్యం వహించినట్లు వెల్లడైంది. కొలనూర్ రైల్వేస్టేషన్ సమీపంలోని పాఠశాలలో తనిఖీ నిర్వహించగా ఇక్కడి ఉపాధ్యాయులు ఉదయం 10.30 పాఠశాలకు హాజరయ్యారు. అనంతరం నాలుగు పాఠశాలల్లో ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వహించకుండా పాఠశాలకు తాళం వేసి ఉన్నట్లు, ఉదయం 10గంటల వరకు ఉపాధ్యాయులు వచ్చినట్లు డీఈవో ధ్రువీకరించారు. అలాగే 9.30కు ఉపాధ్యాయులు ప్రార్థన సమయానికి రావాల్సి ఉండగా ఎవరూ హాజరుకాలేదు. పొత్కపల్లి సీపీఎస్, హైస్కూల్, ఓదెల హైస్కూల్, ఎస్సీకాలనీ పాఠశాల, తారకరామకాలనీ పాఠశాల, గోపరపల్లి యూపీఎస్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించారు. విధులపై నిర్లక్ష్యం వహించిన కొందరు ఉపాధ్యాయులకు ఒకరోజు వేతనం నిలిపివేయాలని ఎంఈవో రాజయ్యను ఆదేశించారు.

బస్టాండ్ల అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



బస్సును ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, మార్చి 14: మంథని నియోజకవర్గంలోని మంథని, మహదేవపూర్, కాళేశ్వరం బస్టాండ్లను ప్రయాణికులకు సౌలభ్యం కోసం అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వపరంగా ప్రణాళికలు రూపొందించినట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. గురువారం అర్ధరాత్రి మంథని బస్టాండ్‌లో మంథని నుంచి హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ వరకు నూతనంగా ఏర్పాటు చేసిన రాజధాని ఏసీ బస్సును మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మూడు నెలలలోపే ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకువచ్చామన్నారు. నూతనంగా 1000 బస్సులను వివిధ డిపోలకు అందజేసి ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా చేశామన్నారు. 23కోట్ల మహిళలు డిసెంబర్ నుంచి ఇప్పటివరకు బస్సులలో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, ఆర్టీసీ డీఎం రాజశేఖరం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రామగుండాన్ని వణికిస్తున్న జ్వరాలు..

కళ్యాణ్‌నగర్, మార్చి 14: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 15రోజులుగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. తీవ్రమైన జ్వరం, వాంతులు, విరేచనాలు, ఒళ్లు నొప్పులు, గొంతు నొప్పి, దగ్గుతో చాలా మంది బాధపడుతున్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోజుకు సుమారుగా 200 నుంచి 300మంది బాధితులు ఈ లక్షణాలున్న వారే ఎక్కువగా కనబడుతున్నారు. చిన్న పిల్లల్లో వాంతులు, విరేచనాలు, బ్లడ్ ఇన్‌ఫెక్షన్ వంటి రోగాల బారిన పడుతుండడంతో గోదావరిఖనిలోని ప్రభుత్వ/ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. రెండు మూడు రోజులైనా జ్వరం తగ్గకపోవడంతో రోగులు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రతి ఏటా మార్చి నెలలో ఇలాంటి లక్షణాలు కనబడడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో జనరల్ ఫిజిషియన్ వద్ద రోగులు బారులు తీరుతున్నారు. దగ్గు, జలుబున్న వారు బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మాస్క్ ధరించాలని వైద్యులు చెబుతున్నారు.

సాగునీరు విడుదల చేయాలని రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

మంథని, మార్చి 14: ఎస్ఆర్ఎస్పీ కాలువ ద్వారా సాగునీటి ప్రభుత్వం విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ రైతులు మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిపై గురువారం రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని సూరయ్యపల్లి, కాకర్లపల్లి, ఖైదుపల్లి, పుట్టపాక, గంగాపురి, ముత్తారం మండలం రామకృష్ణాపూర్ గ్రామాలకు చెందిన రైతులు మంథనిలోని పాత పెట్రోల్ పంపు చౌరస్తాలో ఆందోళనకు దిగారు. వేలాది రూపాయాల పెట్టుబడులు పెట్టి పంటల సాగు చేస్తే పంటలు పొట్ట దశకు వచ్చిన తరుణంలో కాలువల ద్వారా సకాలంలో సాగు నీరు అందించకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు వాపోయారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు నినాదాలు చేశారు. గతంలో రైతులకు సరిపడా సాగు నీరు వచ్చిందని, ఇప్పుడు పంటలు ఎండిపోయే కాలం వచ్చిదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, ప్రభుత్వం రైతులను పట్టించుకొని పంటకు సాగునీరు ఇచ్చి పంటలను రక్షించాలని కోరారు. దాదాపు మూడు గంట పాటు రోడ్డుపై రైతులు ధర్నా నిర్వహించడంతో భారీ ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ధర్నా చేస్తున్న రైతులను పోలీసులు ధర్నా విరమించాలని కోరగా వారు ససేమీరా అన్నారు. రైతుల డిమాండ్ మేరకు ఆర్డీవో హనుమా నాయక్, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్‌లు ధర్నా వద్దకు చేరుకొని రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సాగు నీరు అందిస్తామని హామీ ఇవ్వడంతో రెతులు ధర్నాను విరమించారు. అనంతరం మంథని సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

రైతులపై కక్ష సాధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- జడ్పీ చైర్మన్ పుట్ట మధు



కాకర్లపల్లిలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న పుట్ట మధు

మంథని, మార్చి 14: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించకుండా కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతోందని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జి పుట్ట మధు ఆరోపించారు. మంథని మండలం ఖైదుపల్లి, కాకర్లపల్లి గ్రామాల శివారులో ఎండిపోయిన పంట పొలాలను పుట్ట మధు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడినా.. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ పాలన, మార్పు ఉంటుందని గొప్పలు చెప్పారని, మార్పు అంటే ఇదేనా ప్రశ్నించారు. పదేళ్ల తర్వాత రైతులను నీళ్ల కోసం రోడ్డెక్కించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. నీళ్లు, కరెంటు ఇచ్చి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం లేదన్నారు. పదేళ్ల తర్వాత మంథనిలో రైతులు సాగునీటి కోసం మూడు గంటల పాటు రోడ్డుపై ఉన్నారని, ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పంటలు ఎండిపోయాయని, మిగిలిన పంటలను కాపాడే ప్రయత్నం పాలకులు చేయాలని హితవు పలికారు.

నేడు బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశాలు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

గోదావరిఖని, మార్చి 14: పెద్దపల్లి పార్లమెంటు రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశాలు శుక్రవారం ఉదయం 10గంటలకు రామగుండం హౌసింగ్‌బోర్డు కాలనీ ఎంఎం గార్డెన్స్‌లో, మధ్యాహ్నం 12గంటలకు బసంత్ నగర్ జీఎం గార్డెన్‌లో, సాయంత్రం 5గంటలకు తిలక్‌నగర్ డౌన్ విశ్వం కమ్యూనిటీ హాల్లో నిర్వహించనున్నామని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాలకు బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరవుతారని తెలిపారు.

పంటల పరిశీలన

జూలపల్లి, మార్చి 14 : జూలపల్లి మండల కేంద్రంలో మెండె మల్లేశం అనే రైతు ఆధునిక పద్ధతి సాగు విధానం ద్వారా పండిస్తున్న కూరగాయల పంటలను గురువారం కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారులు రైతులతో కలిసి పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ అధికారులు ప్రత్యూష, అలివేని, ఏఈవోలు రాకేష్, కిరన్మయి, శ్రీవాని, శిరీష, వినయ్, స్వేత, కల్పన, సువర్చల, స్పందన, రైతులు పాల్గొన్నారు.

'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'లను ఏర్పాటు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు

పెద్దపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ పాఠశాలకు 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'లను సత్వరమే ఏర్పాటు చేయాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వపాఠశాలల నిర్వహణ బాధ్యతలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని సీఎస్ కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల స్కూలు యూనిఫామ్ కుట్టే బాధ్యతను స్వశక్తి మహిళా సంఘాలకు కేటాయించామని, జిల్లాలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూల్ యూనిఫాంలో కుట్టే సామర్థ్యంగల మహిళా సంఘాలను గుర్తించి వారికి వెంటనే ఆర్డర్ అందించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మైనర్, మేజర్ మరమ్మతులు, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకురావడం, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదికి విద్యుత్ సౌకర్యం కల్పన వంటి మౌలిక వసతులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా జూన్ 10వరకు కల్పించాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల వద్ద 25వేల రూపాయల వరకు ఎమర్జెన్సీ నిధులు వినియోగించవచ్చని, పాఠశాలలో చేపట్టిన పనులకు లక్ష రూపాయల వరకు ఎంపీడీవో పరిశీలించి బిల్లులు చెల్లిస్తారని, లక్షకుపైగా పనులకు ఎంబుక్‌లను పరిశీలించి కలెక్టర్ చెల్లిస్తారని, అవసరమైన నిధులు కలెక్టర్ వద్ద అందుబాటులో ఉంచుతామన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఈఓ మాధవి, డీఆర్‌డీవో రవీందర్, సీపీవో రవీందర్, మైనింగ్ అధికారి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి నాగలేశ్వర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహ్మద్ మేరాజ్ మహ్మద్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి పాల్గొన్నారు.

పంట రుణాల పంపిణీలో కేడీసీసీబీ ముందంజ

- నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు



కేడీసీసీబీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కొండూరి రవీందర్‌రావు

సుల్తానాబాద్, మార్చి 14: రైతులకు పంట రుణాలు ఇవ్వడంలో అన్ని బ్యాంకులకన్నా కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(కేడీసీసీబీ) ముందంజలో ఉందని సహకార సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలో కేడీసీసీబీ రూ.కోటి32లక్షలతో కొనుగోలు చేసిన స్థలంలో గురువారం బ్యాంకు నూతన భవన నిర్మాణం పనులకు సంబంధించి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రవీందర్‌రావు మాట్లాడారు. 2008లో కేవలం 400 కోట్ల టర్నోవర్‌తో ఉన్న కేడీసీసీబీ ప్రస్తుతం ఆరున్నర వేలకు చేరుకుందన్నారు. ఉమ్మడి జిల్లాలో ఆరున్నర వేల కోట్ల రూపాయల లావాదేవీలు నిర్వహిస్తూ రైతులకు అన్ని రకాల సేవలను అందిస్తున్న ఏకైక బ్యాంక్‌గా దేశంలో నిలిచిందని అన్నారు. కేవలం వ్యవసాయమే కాకుండా అనేక వ్యాపారాలు నిర్వహిస్తూ ఖాతాదారుల అన్ని అవసరాలను తీర్చే విధంగా సంఘాలు బ్యాంకులు పని చేస్తున్నాయని అన్నారు. సుల్తానాబాద్ సహకార సంఘం రూ.150 కోట్ల రుణాలు రైతులకు అందించి రూ.50 కోట్లకు పైగా డిపాజిట్లు కలిగి ఉంటూ రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమతక్రిష్ణ, ఎంపీపీ బాలాజీరావు, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల, కేడీసీసీబీ డైరెక్టర్లు శ్రీగిరి శ్రీనివాస్, డి మోహన్‌రావు, కాంగ్రెస్ నాయకులు అంతటి అన్నయ్యగౌడ్, మినుపాల ప్రకాష్‌రావు, సాయిరి మహేందర్, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ గనుల్లో ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు

- సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్



ఆస్ట్రేలియా బృందంతో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరామ్

గోదావరిఖని, మార్చి 14: భూగర్భ గనులను వంద శాతం ప్రమాదరహిత గనులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ పేర్కొన్నారు. ఇందు కోసం సింగరేణి యాజమాన్యం అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతను పరిశీలిస్తోందని, మేలైన సాంకేతికతను వినియోగించడానికి సిద్ధంగా ఉందన్నారు. గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో భూగర్భ గనుల్లో పైకప్పుకూలి జరిగే ప్రమాదాలను నివారించడం కోసం ఆస్ట్రేలియా దేశానికి చెందిన నోమ్ అనే సంస్థ కొత్తగా రూపొందించిన ఆధునిక పరికరాల పనితీరును పరిశీలించిన అనంతరం ఉన్నత స్థాయి అధికారులతో చర్చించారు. ఆస్ట్రేలియాకు చెందిన పరిశోధన సంస్థ నోమ్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పైకప్పు ప్రమాదాలు జరగకముందే ముందస్తు హెచ్చరికలు జారీచేసే యంత్ర విభాగాన్ని రూపొందించారన్నారు. దీనివలన పైకప్పు ప్రమాదం జరగకముందే గనిలోని కార్మికులను అధికారులు హెచ్చరిస్తూ ఫ్లాష్ లైటింగ్ ద్వారా, సైరన్ ద్వారా ఇది అప్రమత్తం చేస్తుందన్నారు. దీంతో ప్రమాదాన్ని నివారించడం కోసం అన్ని రకాల చర్యలు తీసుకొని, ప్రాణనష్టం జరగకుండా చూసే అవకాశం ఏర్పడుతుందని సీఎండీ పేర్కొన్నారు. జీఎం (ఆర్అండ్‌డి) ఎస్‌డీఎం సుభాని మాట్లాడుతూ ఆస్ట్రేలి యా బృందం వారు ఇచ్చిన డెమోనిస్ట్రేషన్‌ను పరిశీలించామని, దీనిపై ఉన్నతస్థాయిలో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని వివరించారు.

దొంగ అరెస్టు.. 12 బైక్‌లు స్వాధీనం

కరీంనగర్ క్రైం, మార్చి 14 : పార్క్ చేసిన బైక్‌లను దొంగిలించిన ఒక నిందితుడిని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 12 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్‌టౌన్ ఏసీపీ జి నరేందర్ విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం కరీంనగర్‌కు చెందిన చింతల సంపత్‌కు చెందిన బైక్ ఈనెల 11న కనపడకుండా పోయింది. దీంతో బాధితుడు ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. గురువారం ఉదయం ఎస్ఐ స్వామి ఆధ్వర్యంలో కేబుల్ బ్రిడ్జి చౌరస్తాలో వాహనాల తనిఖీలు చేస్తుండగా ఒక వ్యక్తి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా 12 బైక్‌లను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడైన పెద్దపల్లి జిల్లా మంథని ముత్తారం మండలం ఖమ్మంపల్లికి చెందిన గోస్కుల రాజు(27) బైక్ కొనుగోలుకు డబ్బులు లేనందున బైక్‌లను దొంగిలించి కన్సల్టెంట్ నిర్వాహకులకు వాటిని విక్రయించి వచ్చిన డబ్బులతో కొత్త బైక్ కొనుగోలు చేయాలని దొంగతనాలకు పాల్పడ్డాడు. నిందితుడి ఇంటి వద్ద నుంచి దొంగిలించిన 12 బైక్‌లను స్వాధీనం చేసుకుని గోస్కుల రాజును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని ఏసీపీ నరేందర్ తెలిపారు. దొంగను పట్టుకోవటంలో ప్రతిభ కనబరిచిన సీఐ జె సరిలాల్, ఎస్ఐ స్వామి, కె రవి, కె కళ, హెడ్‌కానిస్టేబుల్ హసనుద్దీన్, కానిస్టేబుల్ భాస్కర్, కుమారస్వామిలను ఏసీపీ అభినందించి, నగదు రివార్డును అందించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెద్దపల్లిటౌన్, మార్చి 14: విద్యుదాఘాతంతో గురువారం ఓ వ్యక్తి మృతిచెందాడు. పట్టణంలోని కమాన్ రాజీవ్ రహదారి ప్రాంతానికి చెందిన కాటన్ శ్రీనివాస్ తన ఇంటి రెండో అంతస్తులో ఉన్న ఇనుప పైపులను తీస్తుండగా పైన ఉన్న 11 కేవీ లైన్లకు తగిలి విద్యుత్ సరఫరా అయ్యి అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య రమ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, మార్చి 14: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని ఆదికేశవ పెరుమాండ్ల స్వామి గుట్ట ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశామని ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.20,080 నగదు, నాలుగు బైక్‌లు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. గుట్ట ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేశామని చెప్పారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని వివరించారు.

రేషన్ బియ్యం గోదాంకు తరలింపు

ధర్మారం, మార్చి 14: మండలంలోని మల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బైరెడ్డిపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన 150 క్వింటాళ్ల రేషన్ బియ్యంను గురువారం ధర్మారం నుంచి సివిల్ సప్లై అధికారులు పెద్దపల్లి ఎంఎల్ఎస్(గోదాం)కు తరలించారు.

బుధవారం బైరెడ్డిపల్లిలో నలుగురు వ్యక్తులు అక్రమంగా రేషన్ బియ్యంను నిల్వ చేశారని సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి అక్కడి నుంచి ధర్మారంలోని రేషన్ దుకాణంలో భద్రపరిచారు. ఇక్కడి నుంచి గురువారం సాయంత్రం సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్‌లు శంకర్, రవీందర్‌రాథోడ్, పెద్దపల్లి, మంథని ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు మల్లికార్జున్, శ్రీనివాస్ పెద్దపల్లి ఎంఎల్ఎస్(గోదాం)కు తరలించారు.

చికిత్స పొందుతూ వలస కార్మికురాలి మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 14: మండలంలోని ఓ ఇటుక బట్టీలో బతుకుదెరువు కోసం వచ్చిన వలస కార్మికురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాఘవపూర్‌లోని ఓ ఇటుక బట్టీలో పనిచేసేందుకు ఒరిస్సా నుంచి సమిత్ర బోయి(57) కార్మికురాలు వచ్చింది.

అనారోగ్య సమస్యలు ఉన్నాయని, బుధవారం ఆస్తమా ఎక్కువ కావడంతో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త సర్తా బోయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్ నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.

బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు.. రహస్యమేంటి?

- ఇమడలేకనే బీఆర్ఎస్ వీడుతున్నా: కోనేరు కోనప్ప
- మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాగజ్‌నగర్, మార్చి 14: బీఆర్ఎస్, బీఎస్పీతో పొత్తుపెట్టుకోవటం వెనుక రహస్య ఒప్పందం ఏంటని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై లేనిపోని ఆరోపణలు చేసి ఓడించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో బీఆర్ఎస్ జత కట్టడం ఇమడలేకనే ఆ పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వైస్ చైర్మన్ రాజేందర్‌తోపాటు పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై తనకు ఎలాంటి కోపం లేదన్నారు. తనకు ఎలాంటి పదవులు వద్దని, కేవలం సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధి చాలని వ్యాఖ్యానించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. సిర్పూరు నియోజవర్గ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

బీఆర్ఎస్‌కు పెద్దిరెడ్డి రాజీనామా

హుజూరాబాద్, హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తరువాత కీలక నేతలు పార్టీని వీడుతున్నారు. తాజాగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. తన ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా అధిష్ఠానం వ్యవహార శైలి ఉందని, అది నచ్చకనే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం రాజీనామా లేఖను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంపించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, రాజకీయాలపై సుదీర్ఘ అనుభవం కలిగిన తనకు పార్టీలో సముచిత గౌరవం లభించలేదని పెద్దిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానన్నారు. కాగా ఆయన అధికార కాంగ్రెస్‌లో చేరతారని సమాచారం.

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ముగ్గురు

మహబూబ్‌నగర్, మార్చి14: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగిసింది. ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పోటీలో నిలిచారు. మొత్తం 16మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో ముగ్గురి దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. 10 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్‌కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్ బరిలో నిలిచారు. 28న ఎన్నిక జరగనుంది.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన జానారెడ్డి

- రఘువీర్‌రెడ్డి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న రఘువీర్‌రెడ్డి విజయం కోసం సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మాజీ మంత్రి జానారెడ్డి కోరారు. గురువారం బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసానికి వెళ్లిన జానారెడ్డి తన కుమారుడు రఘువీర్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో తమ మధ్య ఉన్న అనుబంధాన్ని ఇరువురు నేతలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రఘువీర్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.

ఆటోడ్రైవర్ల సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి: హరీశ్

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆటో నడవడం లేదని మనస్తాపంతో నిజామాబాద్‌లో ఓ సోదరుడు తన భార్యతో సహా ప్రాణాలు తీసుకున్న హృదయ విదారక ఘటన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కదిలించకపోవడం బాధాకరమని గురువారం ఎక్స్(ట్విటర్) వేదికగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన వారి బిడ్డ భవిష్యత్‌కు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఆ కుటుంబానికి వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. అలాగే ఆటోడ్రైవర్ల జీవనసమస్యకు పరిష్కారం చూపాలని, వారికి రూ.12వేల భృతి ఇవ్వాలని హరీశ్‌రావు కోరారు. కాగా, డీఎస్సీ పరీక్షలకు ముందే టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమని మరో ట్వీట్‌లో హరీశ్ పేర్కొన్నారు.

డీకే శివకుమార్‌ను కలిసిన మల్లారెడ్డి

తనయుడితో కలిసి బెంగళూరుకు.. కర్ణాటక డిప్యూటీ సీఎంతో భేటీ

పార్టీ మారుతున్నారనే ఊహాగానాలు.. వ్యాపార లావాదేవీలేనన్న మల్లారెడ్డి

హైదరాబాద్/మేడ్చల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గురువారం బెంగళూరులోని ఒక హోటల్లో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిశారు. మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి కూడా వెంట ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి పలువురు నేతలు కాంగ్రెస్‌లోకి చేరుతున్న నేపథ్యంలో మల్లారెడ్డి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ ముఖ్యనేత ప్రియాంకగాంధీని కలిసేందుకు అవకాశం ఇప్పించమని మల్లారెడ్డి కుటుంబసభ్యులు డీకేను కోరినట్లు సమాచారం. గత వారమే మల్లారెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి సీఎం సలహాదారు అయిన వేంనరేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. అప్పుడే ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ప్రచారం జరిగింది. దాంతో కేటీఆర్ మల్లారెడ్డిని తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. తనకు కాంగ్రెస్‌లోకి వెళ్లే ఆలోచన లేదని మల్లారెడ్డి కేటీఆర్‌కు చెప్పారు. ఆ మాట చెప్పి వారం గడవక ముందే డీకే శివకుమార్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ మారుతున్నట్లు వచ్చిన ఆరోపణలను మల్లారెడ్డి ఖండించారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానన్నారు. బెంగళూరుకు ఒక ఫంక్షన్‌కు వచ్చానని, అక్కడ ఒక ప్రైవేటు వర్సిటీ అమ్మకానికి ఉందని ఫ్రెండ్ చెబితే దాని కొనుగోలు గురించి మాట్లాడటానికి మధ్యవర్తి ద్వారా డీకే శివకుమార్‌ను కలిశానని తెలిపారు. , రాజకీయాలేవీ మాట్లాడలేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి 75 ఏళ్లు దాటుతాయని, ఆ ఎన్నికల్లో పోటీచేసే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. ఈ ఐదేళ్లు బీఆర్ఎస్‌లోనే ఉంటూ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. మల్లారెడ్డి డీకే శివకుమార్ దగ్గరే ఆగిపోకుండా ప్రియాంకగాంధీ అపాయింట్‌మెంట్ అడగడం ఊహాగానాలకు తావిస్తోంది. ఆస్తులను కాపాడుకోవడానికి కాంగ్రెస్‌లోకి వెళ్లడమే మార్గమని మల్లారెడ్డి భావిస్తున్నారని కాంగ్రెస్‌లోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మల్లారెడ్డి రాకను మేడ్చల్ కాంగ్రెస్ నేతలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్ రెడ్డి, వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ వ్యతిరేకిస్తున్నారు. రేవంత్ సన్నిహితుడిని కలిసినా చేరిక పని కాకపోవడంతో మల్లారెడ్డి బెంగళూరు వైపు నుంచి నరుక్కొస్తున్నారని భావిస్తున్నారు.

ఆపరేషన్ రేవంత్!

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. రేవంత్ ఆయన సహచర బృందం కదలికలను గుర్తించడంతో పాటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డబ్బులు ఎక్కడినుంచి, ఏయే మార్గాల్లో, ఎవరెవరు సర్దుబాటు చేస్తున్నారు..? అనే వివరాలను ప్రణీత్ ట్యాపింగ్ చేశారు. ముఖ్యంగా ఎన్నికలకు కొద్ది నెలల ముందు నుంచి రేవంత్‌తో పాటు ఆయనకు అత్యంత సన్నిహితులు, సహకరించే అందరి ఫోన్‌లపైనా ట్యాపింగ్ కొనసాగినట్లు ఆధారాలు లభించినట్లు తెలిసింది. అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ ఆదేశాల మేరకు నడుచుకున్న ప్రణీత్.. రాజకీయ నాయకులు, పోలీసులతో పాటు ప్రైవేటు వ్యక్తుల సహకారం కూడా తీసుకున్నారు. ఎక్కడికక్కడ తమకు అందుతున్న సమాచారం, ఫోన్ నంబర్ల ఆధారంగా ఎస్ఐబీ ప్రధాన కార్యాలయం, ఇతర వార్ రూంల నుంచి రోజుల వ్యవధిలోనే వందల ఫోన్‌ల ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. హార్డ్ డిస్క్‌ల ధ్వంసం, కీలక పత్రాల దహనం కేసు దర్యాప్తులో భాగంగా ప్రణీత్ ఫోన్‌లోని వాట్సాప్ చాటింగ్‌లను దర్యాప్తు అధికారులు పరిశీలించగా బీఆర్ఎస్ నేతలతో పాటు ప్రైవేటు వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలను పరిశీలించారు. ఎన్నికల్లో డబ్బులు ఎవరెవరి చేతులు మారుతున్నాయన్న సమాచారం గుర్తించి కట్టడి చేశారని స్పష్టమైంది. అరెస్టు సమయంలో ప్రణీత్‌రావును ప్రాథమికంగా విచారించగా ఒక ఎస్పీ, ఎస్ఐబీ అప్పటి చీఫ్ ఆదేశాల మేరకే తాను, తన బృందం పనిచేసినట్లు వెల్లడించినట్లు తెలిసింది. ప్రణీత్‌ను కస్టడీకి తీసుకుని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఏడు రోజుల కస్టడీ



ప్రణీత్‌రావు (ఫైల్)

కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ప్రణీత్‌రావు కేసుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై సీఎం రేవంత్ పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆరా తీసినట్లు సమాచారం. దీంతో వారు సమగ్ర నివేదిక అందించారని తెలిసింది. ప్రణీత్ వ్యవహారంలో వెలుగులోకి వచ్చిన వ్యక్తుల పేర్లు.. అనుసరించాల్సిన విధానాలపై సీఎంకు వివరించినట్లు సమాచారం. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.

ఉన్నతాధికారుల చుట్టూ ఉచ్చు

ప్రణీత్‌తో అంటకాగి కుట్రలో భాగస్వాములైన ఎస్ఐబీ అప్పటి ఉన్నతాధికారులను నేడో రేపో విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పంజాగుట్ట పోలీసులు వారికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఎన్నికల ముందు పనిచేసినవారిపై దృష్టిపెట్టినట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాల్లో అధికారులు వారి ఇళ్లలోనే ప్రత్యేక గదుల్లో (వార్ రూమ్‌లు) ఏర్పాట్లు చేసి, ట్యాపింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని సిద్ధం చేసిన ప్రణీత్‌కు పలువురు సహచరులూ సహకరించినట్లు తెలుస్తోంది. మూడు నియోజకవర్గాల్లో విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు, ఎస్ఐబీ అధికారి ఇళ్లలో వార్ రూమ్‌లను ఏర్పాటు చేసి, ప్రముఖుల ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్నికల సందర్భంగా ఓ పార్టీ నిధుల తరలింపులోనూ ప్రణీత్ కీలక పాత్ర పోషించారని అనుమానిస్తున్నారు. డబ్బు, బంగారం, వస్తువులను చేరవేసేందుకు సొంత, ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ వాహనాలను వినియోగించారనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ప్రణీత్ ఫోన్ నుంచి కీలక వివరాలు సేకరించే పనిలో సైబర్ నిపుణులు ఉన్నారు. ఆయన తొలగించిన డేటాను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది బయటకు వస్తే మరింతమంది అరెస్టయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే ఎస్ఐబీ లాగర్ రూమ్‌లో పనిచేసిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలను విచారించారు.

ప్రత్యేక బ్యారెక్.. పకడ్బందీ భద్రత

ప్రణీత్‌ను విచారించి ఆధారాలు, సమాచారం రాబట్టేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రణీత్ న్యాయవాదులకు జడ్జి సూచించారు. శుక్రవారం వాదనలు జరిగే అవకాశముంది. కాగా, పోలీసుల అదుపులో ఉన్న ఆయనను బుధవారం రాత్రి చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ప్రణీత్‌ను భద్రతా కారణాల దృష్ట్యా ప్రత్యేక బ్యారెక్‌లో ఉంచారు. సీసీ కెమెరా నిఘాతో పాటు నిరంతరం జైలు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. అటువైపుగా ఇతర ఖైదీలను అనుమతించడం లేదు. గురువారం ఉదయం ప్రణీత్ తరఫు న్యాయవాది అనుదీప్, సోదరుడు వంశీ ములాఖాత్ అయ్యారు.

ట్యాపింగ్ చేయమన్నది ఎవరు?

ట్యాపింగ్‌కు ఎవరు ప్రోత్సహించారు? ఎలాంటి సమాచారం సేకరించారు? ఎవరి పాత్ర ఎంత? అనే ప్రశ్నలకు ప్రవీణ్ స్పష్టంగా సమాధానం ఇచ్చారని తెలుస్తోంది. ఈ మేరకు పంజాగుట్ట పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించారు. ప్రణీత్ ఫోన్ డేటా విశ్లేషించి, ఏయే నంబర్లతో ఎంత మందితో టచ్‌లో ఉన్నారో తెలుసుకున్నారు. ఎవరెవరి ఫోన్‌లు ఎంత కాలం ట్యాప్ చేశారు? తదితర అంశాలను దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్ రూమ్‌లకు ఈ డేటాను అందించినట్లు అంచనాకు వచ్చారు. డేటాను కాపీ చేసిన హార్డ్ డిస్క్‌లు ఎక్కడున్నాయో దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లోకి జితేందర్‌రెడ్డి!

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి జితేందర్ నివాసానికి వెళ్లి అరగంట పాటు సమావేశమయ్యారు. ఇది జితేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న ప్రచారానికి మరింత ఊతమిచ్చినట్లైంది. మరోవైపు ఈ పరిణామం మహబూబ్‌నగర్ జిల్లాలోనూ కలకలం రేపింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి వరకు ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో కాంగ్రెస్ నుంచి జితేందర్‌రెడ్డి పోటీ చేస్తారని పెద్దఎత్తున చర్చ జరిగింది. ఇక గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం వెళ్లి కలిశారంటేనే పార్టీలోకి ఆహ్వానించడానికి కాదా? అని వ్యాఖ్యానించారు. జితేందర్‌రెడ్డి మనస్తత్వం తనకు తెలుసని, ఎంపీగా రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి పనిచేస్తే బీజేపీ మోసం చేసిందని ఆరోపించారు.

ఎన్నికల్లో పోటీ చేయను..

తాను ఎన్నికల్లో పోటీ చేయడం లేదని జితేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. రేవంత్‌తోనూ ఎన్నికల్లో పోటీపై చర్చించలేదని స్పష్టంచేశారు. నిత్యం ప్రజల్లో ఉండే తనకు బీజేపీ టికెట్ రాకపోవడంతో సీఎం బాధపడ్డారని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం చూసి రేవంత్‌రెడ్డి వచ్చినట్లు చెప్పారు. తన భవిష్యత్తును పార్టీ అధినాయకత్వమే చూసుకుంటుందని చెప్పారు. కాగా, జితేందర్‌రెడ్డికి ప్రధాని మోదీ, అమిత్‌షాతో సన్నిహిత సంబంధాలున్నాయి. అయితే, తనకు టికెట్ రాలేదని తెలిసి ఓదార్చేందుకే.. సొంత జిల్లా వాసి అయిన రేవంత్ వచ్చి కలిశారని చెప్పినా మహబూబ్‌నగర్ బీజేపీ, కాంగ్రెస్ వర్గాల్లో మాత్రం పార్టీ మార్పు ఊహాగానాలు పెద్దఎత్తున సాగాయి.

అరుణ ప్రెస్‌మీట్‌లో జితేందర్ కుమారుడు

మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థిగా డీకే అరుణ పేరును ప్రకటించాక జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి అభినందలు తెలిపారు. గురువారం జితేందర్‌రెడ్డి నివాసానికి సీఎం రేవంత్ వెళతారని ప్రచారం జరుగుతున్న సమయంలోనే పాలమూరులో అరుణ మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులోనూ మిథున్‌రెడ్డి పాల్గొనడం గమనార్హం.

నేడు హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెండు రోజుల కిందట వచ్చి, సంస్థాగత బలోపేతంపై రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేశారు. బీజేపీ సోషల్ మీడియా వారియర్స్‌తో పాటు పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆ పైస్థాయి క్యాడర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ ముఖ్య నేతలతో భేటీ అయి పోలింగ్ బూత్‌ల పటిష్ఠత ఆవశ్యకతను వివరించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ శుక్రవారం మరోసారి రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆయన మూడు రోజుల పాటు పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు నగరంలో మోదీ రోడ్ షోను నిర్వహించినట్లుగానే ఈసారి కూడా బీజేపీ అదే విధంగా ప్లాన్ చేస్తోంది. మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు కలిపి ఒక కేంద్రంలో ప్రధాని ఎన్నికల ప్రచారం కొనసాగించేలా రాష్ట్ర పార్టీ ప్రణాళిక రూపొందించింది. ఇందుకు అనుగుణంగా మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ సెగ్మెంట్లకు కలిపి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో జరిగే రోడ్ షోలో మోదీ పాల్గొంటారు. మీర్జాలగూడ నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా 1.3 కి.మీ మేర ఈ రోడ్ షోను భారీ ఎత్తున నిర్వహించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం సాయంత్రం 4.50 గంటలకు ప్రధాని ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. 5 గంటల నుంచి 6 గంటల వరకు రోడ్ షోలో పాల్గొంటారు. మల్కాజ్‌గిరి చౌరస్తాలో ప్రసంగిస్తారు. అనంతరం, ప్రధాని రాజ్‌భవన్‌కు వెళ్లి బస చేస్తారు. శనివారం ఉదయం 11 గంటలకు బయలుదేరి నాగర్‌కర్నూలులో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి ఈ సభను ఏర్పాటుచేశారు. అనంతరం గుల్బర్గా బయలుదేరి వెళతారు. తిరిగి 18న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ సెగ్మెంట్లకు సంబంధించి ఈ సభను ఏర్పాటు చేసినట్లు బీజేపీ వర్గాలు వివరించాయి.

రేవంత్‌కు అభద్రతా భావమెందుకు?: లక్ష్మణ్

కాంగ్రెస్‌కు మెజారిటీ ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అభద్రతా భావంతో మాట్లాడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగాలనే కోరుకుంటున్నామని.. కానీ నిలబెట్టుకోలేకపోతే వారి కర్మ అని అన్నారు. రాష్ట్రంలో 12కు పైగా స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమని మాజీ ఎంపీ, చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఓటమికి, ఆ పార్టీ పతనానికి అహంకారమే కారణమని మాజీ ఎంపీ, బీజేపీ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి సీతారాం ఢిల్లీలో విమర్శించారు. ప్రజలే ఆ అహంకారాన్ని అణచివేశారని తెలిపారు.

పలు ప్రాజెక్టులకు అనుమతులు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలకు పరిపాలనపర అనుమతులు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగుపై రూ.107.30 కోట్లతో ఆనకట్ట, నాగార్జున సాగర్ ఎడమకాలువపై రూ.35.75 కోట్లతో కొడుమూరు ఎత్తిపోతల పథకం రెండో దశ, కరీంనగర్ జిల్లాలోని కలువల వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది.

తెలంగాణలో కాంగ్రెస్‌దే హవా!

17 లోక్‌సభ స్థానాల్లో 10 ఆ పార్టీ ఖాతాలోకే.. బీజేపీ-4, బీఆర్ఎస్-2, మజ్లిస్-1

- ఏపీలో టీడీపీ కూటమికి ఘన విజయం
- 25 సీట్లలో 20 గెల్చుకునే అవకాశం
- ఉత్తరాదిన మళ్లీ బీజేపీ ప్రభంజనం
- పలు రాష్ట్రాల్లో కమలం క్లీన్ స్వీప్!
- ఏబీపీ-సీఓటర్ సర్వే అంచనాలు
- తెలంగాణలో బీజేపీ 8 సీట్లు

గెలుస్తుందని నెట్‌వర్క్ 18 సర్వే వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 14: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ 10 స్థానాలను కైవసం చేసుకోనుందని ఏబీపీ- సీ ఓటర్ ఒపీనియన్ పోల్ అంచనా వేసింది. మొత్తం 17 స్థానాల్లో బీజేపీ 4, బీఆర్ఎస్ 2, ఎంఐఎం 1 స్థానం గెలవవచ్చని పేర్కొంది. కాగా, ఓట్ల విషయానికొస్తే.. కాంగ్రెస్ 43 శాతం, బీఆర్ఎస్ 28 శాతం, బీజేపీ 25 శాతం, ఎంఐఎం ఒక శాతం ఓట్లను దక్కించుకోవచ్చని ఈ సర్వే తెలిపింది. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోరు ఉంటుందని ఈ సర్వే వెల్లడించింది. మొత్తం 25 సీట్లలో టీడీపీ కూటమి 20 సీట్లను తమ ఖాతాలో వేసుకుంటుందని, వైసీపీ కేవలం 5 స్థానాలకే పరిమితమవుతుందని పేర్కొంది. ఓట్ల పరంగా కూటమికి 45 శాతం, వైసీపీకి 42 శాతం, కాంగ్రెస్‌కు 3 శాతం ఓట్లు లభిస్తాయని తెలియజేసింది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే ఈ సర్వే వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.


తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ స్వీప్

కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్ కూటమి 23 సీట్లను, కాంగ్రెస్ ఐదు సీట్లను దక్కించుకుంటాయి. తమిళనాడులో మొత్తం 39 సీట్లనూ డీఎంకే-కాంగ్రెస్ కూటమి స్వీప్ చేయనుంది. కేరళలో ఉన్న 20 సీట్లలో 16 సీట్లు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెల్చుకోనుంది. మిగిలిన నాలుగు సీట్లు వామపక్ష (ఎల్‌డీఎఫ్) కూటమి కైవసం చేసుకుంటుంది. బీజేపీకి ఒక్క స్థానం కూడా దక్కే అవకాశం లేదు. ఇక దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం, అత్యధికంగా 80 సీట్లను కలిగి ఉన్న యూపీలో ఈసారి కూడా బీజేపీ హవా వీయనుంది. 74 స్థానాలను ఆ పార్టీ సారథ్యంలోని ఎన్‌డీఏ కైవసం చేసుకుంటుంది. ఎస్పీ-కాంగ్రెస్‌లకు ఆరుకు మించి లభించే అవకాశాల్లేవు. బిహార్‌లో మొత్తం 40 స్థానాలకుగాను ఎన్‌డీఏ కూటమి 32 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసే అవకాశం ఉంది. మిగిలిన ఎనిమిది సీట్లకే ఇండియా కూటమి పరిమితం కావచ్చు. పంజాబ్‌లో మొత్తం 13 స్థానాలు ఉండగా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరు స్థానాలను గెల్చుకునే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ 5, బీజేపీ, అకాలీదళ్ చెరో స్థానాన్ని ఖాతాలో వేసుకోవచ్చు. 14 సీట్లున్న జార్ఖండ్‌లో 12 ఎన్‌డీఏ కూటమికి, రెండు ఇండియా కూటమికి లభించవచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో మొత్తం ఏడు సీట్లనూ బీజేపీ మరోసారి హస్తగతం చేసుకోనుంది. హరియాణాలో 10 స్థానాలకుగాను బీజేపీ 8, కాంగ్రెస్ 2 స్థానాల్లో విజయం సాధించే అవకాశాలున్నాయి. గుజరాత్ (26), రాజస్థాన్ (25), హిమాచల్ ప్రదేశ్ (4)లను బీజేపీ పూర్తిగా క్లీన్‌స్వీప్ చేయనుంది. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న 11 స్థానాల్లో 9 బీజేపీ ఖాతాలోనే పడతాయని ఏబీపీ సీ ఓటర్ సర్వే అంచనా వేసింది. కాగా, నెట్‌వర్క్ 18.. 'మెగా ఒపీనియన్ పోల్' పేరుతో తెలంగాణలో తమ సర్వే వివరాలను గురువారం వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం.. రాష్ట్రంలోని 17 సీట్లలో బీజేపీ 8 కైవసం చేసుకుంటుంది. కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 2, ఎంఐఎం ఒక స్థానంలో గెలిచే అవకాశాలున్నాయి. అయితే, ఓట్ల పరంగా కాంగ్రెస్ అత్యధికంగా 34 శాతం ఓట్లను దక్కించుకుంటుందని, బీజేపీకి 28 శాతం, బీఆర్ఎస్‌కు 27 శాతం, ఇతరులకు 11 శాతం ఓట్లు లభిస్తాయని ఈ సర్వే పేర్కొంది.

మల్కాజిగిరిలో రాగిడి లక్ష్మారెడ్డి

ఆదిలాబాద్‌లో ఆత్రం సక్కు.. మరో రెండు ఎంపీ స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ఖరారు చేసిన కేసీఆర్

హైదరాబాద్, ఆదిలాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగనున్న మరో ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గురువారం ప్రకటించారు. మల్కాజిగిరి ఎంపీ స్థానానికి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ స్థానానికి ఆత్రం సక్కు అభ్యర్థిత్వాలను ఆయన ఖరారు చేశారు. ఇప్పటికే ప్రకటించిన వాటితో కలిపి ఇప్పటి వరకు 11లోక్‌సభ స్థానాలకు బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించింది. ఉప్పల్ టికెట్ రాకపోవడంతో రాగిడి లక్ష్మారెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే మల్కాజిగిరి స్థానం నుంచి పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ అనూహ్యంగా రాగిడి లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంపై పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన నేతలతో నందినగర్‌లోని తన నివాసంలో కేసీఆర్ గురువారం భేటీ అయ్యారు. ఆదిలాబాద్‌లో



రాగిడి లక్ష్మారెడ్డి ఆత్రంసక్కు

పార్టీ అభ్యర్థి ఎవరన్నదానిపై నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో ఆదివాసీ ఉద్యమనేత, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు టికెట్ ఇవ్వాలని నిర్ణయించారు. సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయనకు ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో అవకాశం ఇవ్వలేదు. అదేసమయంలో ఆయనకు లోక్‌సభకు అవకాశం ఇస్తామన్న అధినాయకత్వం హామీ మేరకు తాజాగా ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందిన ఆత్రంసక్కు ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఇప్పటికే బీజేపీ పార్టీ ఆదివాసీ నేతను అభ్యర్థిగా ఖరారు చేయడం, కాంగ్రెస్‌పార్టీ ఆదివాసీ నేతను బరిలోకి దించేందుకు అవకాశం ఉండడంతో బీఆర్ఎస్ కూడా ఆదివాసీనేతకు అవకాశం కల్పించింది. పొత్తుల్లో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఎస్పీ పార్టీ అభ్యర్థి, జడ్పీ మాజీ చైర్మన్ సిడాంగణపతికి అవకాశం దక్కుతుందన్న ప్రచారం జరిగింది. కానీ ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ నేతలంతా ఆత్రంసక్కు వైపే మొగ్గు చూపడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. కాగా గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి ఓటమిపాలైన నగేశ్.. తనకు ఈసారి టికెట్ దక్కదని భావించి పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆయనకు ఆదిలాబాద్ టికెట్ ప్రకటించారు.

సంక్షిప్త సమాచారం

● పెద్దపల్లి రూరల్ : మండలంలోని కొత్తపల్లిలో ఏర్పాటుచేసిన అక్రమ వెంచర్‌లలో గురువారం డీఎల్‌పీవో వేణు గోపాల్ సమక్షంలో హద్దురాళ్లను తొలగించారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా వెంచర్‌లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వెంట ఎంపీవో సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

● పెద్దపల్లి రూరల్ : మండలంలోని అర్హులైన వారు గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని చీకురాయిలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. వెంట ఏపీవో రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రాధ, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

● ధర్మారం : మండల కేంద్రంలోని ఇళ్ల యజమానులు ఇంటి పన్ను చెల్లించాలని కోరుతూ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గురువారం విస్తృత ప్రచారం చేపట్టారు. గ్రామపంచాయతీలో బకాయిలు ఉన్న ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌బాబు ప్రత్యేకంగా ఆటోకు మైకుని ఏర్పాటుచేసి ప్రచారం చేస్తున్నారు.

● ముత్తారం : ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలపడంపై ఆర్యవైశ్యులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు గడ్డం శ్రీధర్, ప్రధాన కార్యదర్శి అనంతుల సంతోష్, కోశాధికారి ఆరగొండ సమ్మయ్య, కోటగిరి శ్రీనివాస్, ఎల్లంకి సత్యనారాయణ, మల్యాల హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

● సుల్తానాబాద్ : వైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించడంపై సుల్తానాబాద్ వైశ్య సంఘాల ప్రతినిధులు ఐబీచౌరస్తా వద్ద గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయరమణారావుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

● కోల్‌సిటీటౌన్ : పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ రామగుండం కార్పొరేషన్ ఏరియా పద్మశాలి సేవా సంఘం, పోపా, మహిళా, యువజన విభాగాల ఆధ్వర్యంలో గురువారం గోదావరిఖని ప్రధానచౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌రాజ్‌ఠాకూర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

● ముత్తారం : మండలంలోని మచ్చుపేటలో కొన్ని రోజులుగా 6, 7 వార్డులలో నీటి సమస్య నెలకొనడం తో స్పందించిన మాజీ సర్పంచ్ మేడగోని సతీష్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి బోరును రిపేర్ చేయించారు.

● అంతర్గాం : రామగుండం పట్టణంలోని రైల్వే స్టేషన్ ఏరియాలో గల తబితా ఆశ్రమంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మనాలి దంపతుల పెళ్లిరోజు వేడుకను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు.

● సుల్తానాబాద్ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మంద రాజు కుటుంబానికి గురువారం తాళ్లపల్లి ఆగయ్య ఫౌండేషన్ వారు 25 కిలోల బియ్యం నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు.

● యైటింక్లయిన్‌కాలనీ : కాలనీకి చెందిన బీఆర్ఎస్‌వీ నాయకులు పరకాల ప్రశాంత్, ఎస్కే. తాజ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి, దామోదర్‌రావు ఉన్నారు.

● రామగిరి : మండలంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన కస్తూర్బా పాఠశాలలో ఆధునీకరణ పనుల చేపట్టేందుకు మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ఎంపీపీ ఆరెల్లి దేవక్క, ఎంపీడీవో శైలజాలు కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. ఎంపీటీసీ చిందంమహేష్, పాఠశాల హెచ్‌ఎం మంజుల, నాయకుడు ఆరెల్లికొంరయ్యగౌడ్ పాల్గొన్నారు.

● కోల్‌సిటీటౌన్ : గోదావరిఖని సప్తగిరికాలనీలోని రామగుండం మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో గురువారం వార్షికోత్సవం, ఫేర్‌వెల్ డే నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపల్ రజిత, వైస్ ప్రిన్సిపల్ సబితారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పెద్దపల్లి రూరల్ : మండలంలోని అప్పన్నపేట నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఊరికి చివర నిర్మించవద్దని గురువారం గ్రామస్థులు రాస్తారోకో నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు.

● కోల్‌సిటీ : నిషేధిత ప్లాస్టిక్ బ్యాగులను విక్రయిస్తే జరిమానా విధిస్తామని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాలతో హెల్త్‌అసిస్టెంట్ కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధూకర్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది గురువారం కళ్యాణ్‌నగర్, లక్ష్మీనగర్‌లోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. జ్యూస్ సెంటర్లు, మద్యం దుకాణాల్లో ప్లాస్టిక్ గ్లాసులు వాడవద్దని అవగాహన కల్పించారు.

● కోల్‌సిటీ : టాస్క్‌ఫోర్స్ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది గురువారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జిలో దాడి చేసి 9మంది జూదరులను అదుపులోకి తీసుసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. వారి వద్ద నుండి రూ.1,61,320నగదు, పేక ముక్కలు, 8 సెల్‌ఫోన్లు, స్వాధీనపరచుకొని గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌లకు అప్పగించారు.

రహదారి విస్తరణకు మోక్షమెప్పుడో?

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కమాన్‌పూర్ క్రాస్ వద్ద ఇరుకుగా ఉన్న రహదారి

కమాన్‌పూర్, మార్చి 14 : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి విస్తరణకు నోచుకోవడం లేదు. కమాన్‌పూర్ క్రాస్ నుంచి మొదలయ్యే ఈ రహదారి పెంచికల్‌పేట మీదుగా గోదావరిఖని, ఎన్‌టీపీసీ, ఎఫ్‌సీఐ వరకు వెళ్తుంది. ఈ దారిగుండా ప్రతిరోజు భారీ, అతి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బసంత్‌నగర్ నుంచి వాహనాలు వెళ్లే సమయంలో ఎన్‌టీపీసీ వద్ద ఉన్న టోల్‌గేట్ చార్జీలు పడుతుండటంతో భారీ వాహనదారులు కమాన్‌పూర్ క్రాస్‌రోడ్డు మీదుగా గోదావరిఖని, ఎన్‌టీపీసీ, ఎఫ్‌సీఐకి వెళ్తున్నారు. ఈ వాహనదారులు మండల కేంద్రం నుంచి వెళ్తున్న సమయంలో స్కూల్ వాహనాలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తున్న వేళ అత్యంత రద్దీగా మారుతోంది. వాహనాల రద్దీ దృష్ట్యా రహదారిని నాలుగు వరుసలుగా మారిస్తే మండల కేంద్ర రూపురేఖలు మారే అవకాశం ఉండటంతో పాటుగా, వాహనాల రాకపోకలు సైతం సాఫీగా సాగే అవకాశం ఉంది. 2014, 2019 ఎన్నికల సమయంలో రోడ్డు విస్తరణ చేపడుతామని బీఆర్ఎస్ పార్టీ హామీ ఇచ్చి విస్మరించింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇరుకు రోడ్డు విస్తరణ చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

● రోడ్డు విస్తరిస్తే ఇబ్బందులు తొలగుతాయి...

- నల్లవెల్లి శంకర్, కమాన్‌పూర్



కమాన్‌పూర్ క్రాస్ వద్ద వాహనాన్ని తిప్పాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని తిప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. స్కూల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు వస్తున్న సమయంలో ఇరుకుగా రహదారి ఉండటం మూలంగా తరచూ చిన్నచిన్న ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వెంటనే రహదారి విస్తరణ పనులు చేపట్టాలి.

ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



కాపులపల్లిలో సింగిల్‌విండో గోదాం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



నాంసానిపల్లి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లి రూరల్, మార్చి 14 : రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. గురువారం మండలంలోని కాపులపల్లి, కనగర్తి, పెద్దకల్వల, పెద్దబోంకూర్, కొత్తపల్లి గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా విడుదల అయిన నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అప్పన్నపేట వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కాపులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించనున్న గోదాం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీటీసీ రామ్మూర్తి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీటీసీ ఎడెల్లి శంకరయ్య, ఎంఈవో సురేంద్రకుమార్, మాజీ సర్పంచ్ కారెంగుల రమేష్, మాజీ ఉపసర్పంచ్ అర్కుటి సంతోష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు పెగడ రమేష్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్, సీఈవో తిరుపతి, ఎంపీవో సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని, వివిధ గ్రాంట్ల ద్వారా మంజూరైన రూ.12 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపడుతామని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ ఐబీ చౌరస్తా నుంచి గట్టేపల్లి రోడ్డు వరకు రూ.2కోట్ల 70లక్షల డీఎంఎఫ్‌టీ, ఆర్‌అండ్‌బీ నిధులతో నాలుగు లైన్ల రోడ్డుతో పాటు సెంట్రల్ లైటింగ్ పనులకు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, వైస్‌చైర్ పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, కౌన్సిలర్ అరుణబాపురావు, ఎంపీపీ బాలాజీరావు, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వేణుగోపాల్, నాయకులు మినుపాల ప్రకాష్‌రావు, అన్నయ్య, ప్రకాష్‌రావు, సాయిరి మహేందర్, దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఓదెల : ఎస్ఆర్ఎస్‌పీ డి-86 ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. మండలంలోని నాంసానిపల్లి నుంచి కాల్వ శ్రీరాంపూర్ మండలం లక్ష్మీపూర్ వరకు డీఎంఎఫ్‌టి నిధులు రూ. మూడు కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, జెడ్పీటీసి వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, బైరి రవి గౌడ్, గోపు నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ సామశంకర్, ఎండి మునీర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్ : వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన షెడ్లను గురువారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు 2కోట్ల 21 లక్షల రూపాయల వ్యవసాయ మార్కెట్ నిధులతో మూడు బ్లాక్‌లుగా నిర్మించారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి దేవరాజు పృథ్వీరాజు, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌కుమార్, మాజీ మార్కెట్ చైర్మెన్లు, శంకర్ నాయక్, గుండేటి ఐలయ్య యాదవ్, నాయకులు నూగిళ్ళ మల్లయ్య, భూతగడ్డ సంపత్, కొట్టే సదానందం, ఈర్ల స్వరూప, సయ్యద్ మస్రత్, సాంబి రెడ్డి, శ్రీమాన్, తుల మనోహర్‌రావు, అమ్రీష్, దేవసాని రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

వసూలు చేసిన డబ్బును అభివృద్ధికి కేటాయించాలని ధర్నా



గుండ్లపల్లిలో ధర్నా చేస్తున్న గ్రామస్థులు

ఓదెల, మార్చి 14 : అభివృద్ధి పేరుతో ఇసుక లారీల వద్ద వసూలు చేసిన డబ్బును గ్రామాభివృద్ధికి కేటాయించాలని గురు వారం మండలంలోని గుండ్లపల్లిలో గ్రామస్తులు వాహనాలను నిలిపి ధర్నా నిర్వహించారు. కొన్నాళ్లుగా మానేరు వాగు నుంచి ఇసుక రవాణా చేసే లారీల వద్ద గ్రామ అభివృద్ధి కోసం డబ్బులు వసూలు చేశారని, అలాగే మొత్తం రూ.57.9 లక్షలు సమకూరాయని తెలిపారు. పోలీసులు అక్కడికి చేరుకొని మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. వసూలు చేసిన డబ్బులు బ్యాంక్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేస్తానని తిరుపతిరెడ్డి ఎస్ఐ అశోక్‌రెడ్డికి తెలపడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

కమాన్‌పూర్, మార్చి 14: మండలంలోని గుండారం రిజర్వాయర్ నుంచి రామగిరి, ముత్తారం, మంథని, మండలాల ఆయకట్టు రైతులకు డీఈ రాజేందర్ ఆధ్వర్యంలో నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్‌లో 10ఫీట్ల అడుగుల నీటి నిల్వలు ఉండగా, దిగువకు నీటిని విడుదల చేస్తే ఆయకట్టు రైతుల పరిస్థితి ఏంటని స్థానిక రైతులు అధికారులను ప్రశ్నించి ఆందోళనకు దిగారు. త్వరలోనే ఎల్లంపల్లి నీటితో రిజర్వాయర్‌ను నింపుతామని డీఈ హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

‘తొలిమెట్టు’ ద్వారా విద్యార్థుల్లో అద్భుత ప్రగతి

- ధర్మారం మండల విద్యాధికారి ఛాయాదేవి

ధర్మారం, మార్చి 14: తొలిమెట్టు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అద్భుతమైన ప్రగతిని కనబరుస్తున్నారని ధర్మారం మండల విద్యాధికారి ఛాయాదేవి అన్నారు. గురువారం మండలంలోని రచ్చపల్లి ప్రాథమిక పాఠశాలలో కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో ఛాయాదేవి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సముద్రాల వంశీమోహనాచార్యులు, ఉపాధ్యాయులు సంపత్, లక్ష్మణ్, రామన్, ప్రభాకర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఎంపీటీసీ సభ్యురాలు రోజారాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేస్తున్న ఎంఈవో ఛాయాదేవి



కాంట్రాక్టు కార్మికులకు పెనాల్టీ రద్దు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 14: సింగరేణి కాంట్రాక్టులకు గైర్హాజరీకి పెనాల్టీని రద్దు చేయాలని కోరుతూ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు గురువారం ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఏరియా పరిధిలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు అనారోగ్య సమస్య, అత్యవసర పరిస్థితుల్లో ఒక్కరోజు విధులకు హాజరు కాకపోతే రూ. 300 వేతనం నుంచి రికవరీ చేస్తున్నట్టు తెలిపారు. కంపెనీ అవసరాల దృష్ట్యా కాంట్రాక్టు కార్మికుడు 8గంటల తర్వాత పనులు చేయించుకుంటున్నా, ఓటీ, డబుల్ మస్టర్ ఇవ్వడం లేదని తెలిపారు. పండగలకు సెలవులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. వేతనాల్లో రికవరీ చేయడం మానుకునేలా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు జీఎంను కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాజారత్నం, ఉల్లి మొగిలి, బీ అశోక్‌లు ఉన్నారు.

ఓసీపీ-2లో త్రుటిలో తప్పిన ప్రమాదం

రామగిరి, మార్చి 14: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో షావల్‌ఆపరేటర్‌కు గురువారం త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాల్లో వెళితే.. 4 సీఎమ్ వద్ద హైవాల్స్‌లో ఎస్-3 షావల్‌తో బొగ్గును తొలగిస్తున్న క్రమంలో షావల్ నిలిపిన స్థలంలో ఇసుక మోటా స్లైడ్ అవడంతో షావల్ ఒక పక్కకు కొంతమేరకు కుంగిపోయింది. దీంతో ప్రమత్తమైన ఆపరేటర్ కృష్ణాకుమార్ క్యాబిన్ నుంచి వెలిపలికి వచ్చాడు. అనంతరం షావల్ ఆపరేటర్ కృష్ణా కుమార్ మరో షావల్ సహాయంతో తన షావల్‌ను బయటకు లాగాడు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో కార్మికులు ఊపిరి పిల్చుకున్నారు.

రామాలయంలో పూజా కార్యక్రమాలు

రామగిరి, మార్చి 14: మండలంలోని సెంటినరీకాలనీలోని కోదండ రామాలయం, షిర్డిసాయి ఆలయంలో 17వ సప్తపది వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం నగర సంకీర్తన, అభిషేకం, హోమ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్‌వో టూ జీఎం రఘుపతి, ఆలయ కమిటీ చైర్మన్ వనం రాంచందర్‌రావులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గంటవెంకటరమణారెడ్డి, రవీందర్, ఉపాధ్యక్షుడు కాటంసత్యం, తులసీరామ్ గౌడ్, కోశాధికారి విశ్వేశ్వర్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రామగుండంలో 800మెగావాట్ల విద్యుత్ కేంద్రం

- జెన్‌కో పవర్‌హౌస్‌కు బదులుగా విద్యుత్ ప్లాంట్ - ప్రభుత్వం నుంచి సింగరేణికి సూచనలు

గోదావరిఖని, మార్చి 14: సింగరేణి సంస్థ మరో 800మెగవాట్ల విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసే పరిణామాలు కనిపిస్తున్నాయి. రామగుండంలోని జెన్‌కో పవర్‌హౌస్ ప్రాంతంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ కోసం రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ మూడు మాసాలుగా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వమే జెన్‌కో ద్వారా ఈ ప్లాంట్ నిర్వహించాలని మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరుతున్నారు. ఈక్రమంలో మంగళవారం హైదరాబాద్‌లో సింగరేణి గెస్ట్‌హౌస్ ప్రారంభోత్సవం సందర్భంగా ఉపముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క రామగుండం విద్యుత్ ప్లాంట్‌పై స్పష్టతనిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ దృష్ట్యా సింగరేణి ద్వారా రామగుండంలో విద్యుత్‌ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. దీంతో రామగుండంలో విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి మార్గం సుగమమం అయ్యింది. జెన్‌కోకు సంబంధించిన 500ఎకరాల స్థలం కూడా సిద్ధంగా ఉండడంతో ప్లాంట్‌కు సంబంధించిన సాంకేతిక విషయాలు, ప్రభుత్వ అధికారిక సూచన మినహా విద్యుత్ ప్లాంట్‌కు మరే పెద్ద అడ్డంకులు లేనట్టుగానే తెలుస్తున్నది. థర్మల్ విద్యుత్ ఉపయోగానికి బొగ్గు, నీరు రామగుండంలో అందుబాటులో ఉన్న కారణంగా విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన అన్ని రకాల వసతులు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అవకాశాలను మెరుగుపరుస్తున్నాయి. సింగరేణి సంస్థ గోదావరిఖనిలో గత సంవత్సరం రూ.500కోట్లతో ప్రభుత్వం ఒత్తిడితోనే మెడికల్ కళాశాలను ఏర్పాటుచేసింది. అదే తరహాలో రామగుండంలో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే సింగరేణి జైపూర్‌లో 600మెగావాట్ల రెండు యూనిట్లను అంటే 1200మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నది. ఇదే ప్లాంట్‌లో 800మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు కూడా టెండర్ ప్రక్రియ ద్వారా వచ్చింది. దీనికి తోడు సింగరేణి వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మొత్తం 234మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తిని కూడా సింగరేణి చేస్తున్నది. వారం రోజుల క్రితం సింగరేణి సీఎండీ నిర్వహించిన ప్రత్యేక సమీక్షలో సింగరేణి సంస్థ ద్వారా భారీ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయాలు తీసుకున్నారు. రాజస్థాన్‌లో 500మెగావాట్ల సోలార్ ప్లాంట్, తెలంగాణలో 800మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. లోయర్ మానేరుపై 300మెగావాట్లు, మల్లన్న సాగర్‌పై 250మెగావాట్ల రెండు సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికి తోడు పవన విద్యుత్‌పై కూడా సింగరేణి దృష్టి పెట్టింది. ఇప్పటికే 1200మెగావాట్ల థర్మల్ విద్యుత్ చేస్తున్న సింగరేణి జైపూర్‌లో మరో 800మెగావాట్ల యూనిట్‌తో మొత్తం 2000 మెగావాట్ల థర్మల్ విద్యుత్‌తో పాటు వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తిని చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నది. దీనికి తోడు రామగుండంలో 800మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని సింగరేణి నెలకొల్పితే సింగరేణి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 2800మెగావాట్లకు చేరుకుంటుంది. సోలార్, థర్మల్ విద్యుత్ కలిపి 3800మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సింగరేణిలో జరిగే అవకాశం ఉంది. అంటే సింగరేణి బొగ్గు ఉత్పత్తి కేంద్రంగానే కాకుండా విద్యుత్ ఉత్పత్తి కర్మాగారంగా ఎదిగే అవకాశాలు ఉన్నాయి. రామగుండంలో విద్యుత్ కేంద్రం ఏర్పాటుపై నిన్న మొన్నటి దాక కొంత అనుమానాలు ఉన్నప్పటికీ ఉప ముఖ్యమంత్రి సింగరేణి ద్వారా రామగుండంలో 800మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నామని చెప్పడంతో మరింత స్పష్టత వచ్చింది.

ఆర్జీ-2లో మహిళా దినోత్సవం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 14: సింగరేణి ఆర్జీ-2 ఆధ్వర్యంలో గురువారం స్థానిక కమ్యూనిటీహాల్‌లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏరియాసేవా అధ్యక్షురాలు మాలతీ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి జీఎం సూర్యనారాయణ బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా మహిళల సాంస్కృతిక పోటీలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, సీఎంఓఏఈ ప్రతినిధి రాంరెడ్డి, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్‌తో పాటు సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న మహిళలు

పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ టికెట్ మాదిగలకే ఇవ్వాలి



రిలే దీక్షలో పాల్గొన్న మాదిగ ఐక్యవేదిక సభ్యులు

పెద్దపల్లిటౌన్, మార్చి 14: పెద్దపల్లి పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ మాదిగలకు కేటాయించాలని మాదిక ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే దీక్ష చేపట్టారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మాదిగలకు కేటాయించకుండా నేతకాని, మాల సామాజిక వర్గం వర్గాలకు కేటాయించాయని మాదిక ఐక్యవేదిక నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అయినా తప్పకుండా మాదిగలకు పార్టీ టిక్కెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మామిడిపల్లి బాబయ్య, కోటగిరి పాపాయ్య, కాంపెల్లి ప్రభాకర్, ప్రభాకర్, చిలుక తిరుపతి, నరసింహారావు, సందీప్ పాల్గొన్నారు. మొదటి రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న వారికి పల్లె సదానందం, ఆసంపల్లి శ్రీనివాస్, బొంకూరు సురేందర్‌లు నిమ్మ రసం ఇచ్చి విరమింపజేశారు.

‘దళితులను మోసం చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్’

పెద్దపల్లిటౌన్, మార్చి 14 దళిత బహుజన ముసుగులో రాష్ట్ర దళితులను బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మోసం చేస్తున్నారని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ కనకం గణేష్ మహారాజ్ ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఓ ఇంటర్వ్యూలో డాక్టర్ విషాదన్ మహారాజ్ గురించి మాట్లాడిన తీరు సరిగా లేదన్నారు. ప్రవీణ్ చరిత్ర అందరికీ తెలుసని అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు గట్టిగా బుద్ధి చెప్పారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కో కన్వీనర్ నేత్ర శ్రీనివాస్, జిల్లా నాయకులు ఏదుళ్ళ శంకరయ్య, కండె రవీందర్ పాల్గొన్నారు.

‘గడ్డం వంశీతోనే దళిత జాతి అభివృద్ధి’

పెద్దపల్లి టౌన్, మార్చి14: పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణను పెద్దపల్లి స్థానం నుంచి గెలిపించుకుంటే దళిత జాతి మరింత అభివృద్ధి జరుగుతుందని మహనీయులు ఆశయ సాధన సమితి అధ్యక్షులు బొంకూరు కైలాసం పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగల్లో టికెట్ కేటాయించాలంటూ ర్యాలీలు ధర్నాలు చేస్తున్న కొంతమంది ఎవరికి టికెట్ కేటాయించాలో చెప్పడం లేదన్నారు. అలాగే స్థానిక మాదిగలను కలుపుకొని పోకుండా రౌండ్ టేబుల్ సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ సమావేశంలో కండె కరుణాకర్ పాల్గొన్నారు.

‘ఆసంపల్లి శ్రీనివాస్‌కు కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇవ్వాలి’

మార్కండేయకాలనీ, మార్చి 14: కాంగ్రెస్ నాయకుడు ఆసంపల్లి శ్రీనివాస్‌కు కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ కేటాయించాలని గోదావరిఖనికి చెందిన పలువురు కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకులు అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆసంపల్లి శ్రీనివాస్ గోదావరిఖని కోర్టు ఆవరణలో న్యాయవాదులను కలిసి మద్దతును కోరారు. మాదిగ సామాజికవర్గానికి చెందిన ఆసంపల్లి శ్రీనివాస్‌కు టికెట్ ఇస్తే పెద్దపల్లి పార్లమెంట్‌లో గెలుపు సునాయసం అవుతుందని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు శైలజ అన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ నాయకులు ఆసంపల్లి రవి, ప్రకాష్, వరలక్ష్మి, శ్రీలత, మనోహర్, శ్రీనివాస్, ఉమర్, ఇరుగురాళ్ల సంతోష్, తిలక్, పల్లవి పాల్గొన్నారు.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వరల్డ్ కిడ్నీ డే



కేక్ కట్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ దయాల్‌సింగ్

కళ్యాణ్‌నగర్, మార్చి 14: వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. రక్తపోటును నియంత్రించడంలో మూత్రపిండాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ అప్పారావు, డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జి రవీందర్, టెక్నిషియన్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఫేర్ వెల్ డే వేడుకలు

పెద్దపల్లి రూరల్, మార్చి 14 : మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 10వ తరగతి విద్యార్థులకు ఫేర్ వెల్ డే వేడుకలు నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, రామేశ్వర్, కనుకయ్య, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, విజయరాణి, శ్రీదేవి, జ్యోతి, మంజుల, సీఆర్‌పీ తిరుపతితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

కార్ల్ మార్క్స్‌కు ఘన నివాళి

కళ్యాణ్‌నగర్, మార్చి 14: కార్ల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా గురువారం గోదావరిఖని భాస్కరరావు భవన్‌లో మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కే కనకరాజ్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు గౌతం గోవర్ధన్, గోషిక మోహన్, మడికొండ ఓదెమ్మ, తొడుపునూరి రమేష్ కుమార్, బి.కనకయ్య, మార్కపురి సూర్య, శనిగరపు చంద్రశేఖర్, ఏర్రల రాజయ్య, రేణికుంట్ల ప్రీతం, కల్వల జగన్, చిలముల రాజయ్య, రేణుక, నస్పూరి గట్టయ్య పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలనే మున్సిపల్ అధికారులు కూల్చివేశారు

మంథని, మార్చి 14: మున్సిపల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించిన కట్టడాలను మాత్రమే కోర్టు ఆదేశంతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది కూల్చివేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ నేతలు వొడ్నాల శ్రీనివాస్, అయిలి ప్రసాద్ వెల్లడించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ. అక్రమ కట్టడాల విషయంలో బీఆర్ఎస్ నేత తగరం శంకర్‌లాల్ చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. కోర్టు నిర్ణయాన్ని రాజకీయ రంగు పులమడం సిగ్గుచేటన్నారు. వారికి గతంలో ఉన్న పాలకవర్గం డబ్బులు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా ఇష్ట రాజ్యంగా అనుమతులు ఇచ్చారన్నారు. కూల్చివేతలకు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కొత్త శ్రీనివాస్, అజీంఖాన్, ఎరుకల ప్రవీణ్, వెంకన్న,పెంటరి రాజులు పాల్గొన్నారు.

కృష్ణవేణి వికాస్ కళాశాల చైర్మన్ నాగండ్లకు డాక్టరేట్



రవికుమార్‌కు డాక్టరేట్‌ను అందజేస్తున్న హెచ్ఎస్‌సి యూనివర్సిటీ ప్రతినిధులు

కోల్‌సిటీటౌన్, మార్చి 14: ఇరవై సంవత్సరాలుగా విద్యారంగంతో పాటు సేవ, స్పిరిచువల్ కార్యక్రమాలతో సేవలు అందిస్తున్న గోదావరిఖనికి చెందిన కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల చైర్మన్ నాగండ్ల రవికుమార్ డాక్టరేట్ దక్కింది. ఈమేరకు గురువారం రవికుమార్‌కు హైదరాబాద్‌లోని హోలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. డాక్టర్ బిషప్ ఆనంద్, డాక్టర్ మమత, డాక్టర్ అబ్రహం, డాక్టర్ పసుల రామ్మూర్తి చేతుల మీదుగా రవికుమార్‌కు అందజేశారు.